# వాడి సొమ్మేలు


పి. సరళాదేవి

గోపాలం ఇంత వాడవుతాడని నేను కలలో కూడా అనుకోలేదు. పుట్టి బుద్ధెరిగిన ఈ పాతికేళ్ల జీవితంలోనూ, గోపాలం ఏనాడూ తల్లీ తండ్రీ మాటకు ఎదురాడలేదు. భూమిమీద పడ్డ మరుక్షణం ఏడవడం కూడా చేత కాలేదు వాడికి తలకిందులు చేసి మంత్రసాని పిర్రలమీద కొడితేగాని, పెరుగుతూన్న రోజుల్లో 'అమ్మా వాడు కొట్టాడే' అని ఏడవడం తప్ప, 'నాకిది కావాలే' అని ఒక్కనాడూ ఏడవలేదు.

హైస్కూలు చదువయిపోయాక-'ఏం చదువుతావురా?' అని తండ్రి అడిగితే, 'నువ్వేది చదవమంటే అదే చదువుతాను' అన్నాడట. దాంతో ఆ తండ్రి సీతారామయ్య కొండంత పొంగిపోయి 'నా కొడుకు శ్రీరామ చంద్రమూర్తి అవతారమే' అని అనుకొంటూ, నా దగ్గరకు పరుగెత్తుకొచ్చాడు. 'ఏం చెయ్యమంటావురా సుబ్బారావు' అంటూ.

ఇద్దరం కలిసి వారం రోజులపాటు దీర్ఘంగా ఆలోచించాము. వున్న ఒక్క కొడుకునూ దూరాభారం పంపడంకన్నా, వున్న వూళ్లోనే, కన్నులోగిలిలోనే వుంచడం మంచిదని నిశ్చయించాము. మా అభీష్టానుసారం ఇక్కడే బి.ఎ. పూర్తి చేసి బి.యిడి కూడా అయిందనిపించాడు. వున్న వూళ్లోనే వుద్యోగం దొరకడంతో సీతారామయ్య దంపతుల ఆనందానికి మేరలేదు.

ఇంత బుద్ధిమంతుడయిన గోపాలాన్ని చూస్తున్నకొద్దీ నాకే ఒక కూతురుంటేనా అనిపించేది. ఈ పాతికేళ్ల వాడి జీవితంలో తలెత్తి ఏనాడు ఒకళ్లతో పోట్లాడలేదు, పెద్దలపట్ల వాడి వినయ విధేయతలూ, పిన్నలపట్ల వాడి ఆదరాభిమానాలూ అనుభవించ వలసిందే గాని మాటలతో చెప్పలేము. వాడు తండ్రిని ఎలా గౌరవిస్తున్నాడో ఏ సంబంధమూ లేని నన్ను కూడా 'మావయ్యా' అంటూ అలాగే గౌరవించేవాడు. ఇటువంటి వాడిని చూసుకొని ఏ తల్లీదండ్రీ మాత్రం సంబరపడరు.



ఇంక మిగిలిందేమిటి?- పెళ్లి! ఏ వయసు ముచ్చట ఆ వయసుదే కాబట్టి, వయసు ముదరకముందే ఆ శుభకార్యం కూడా జరిపించేసి, వాళ్ల ముద్దూ ముచ్చటా కళ్లారా చూసి ఆనందించాలనిపించింది సీతారామయ్య దంపతులకు. బుద్ధి పుట్టడమేమిటి?- పిలిచి వాడిని అడిగారు. 'ఏమిరా పెళ్లి చేసుకుంటావురా?' అని.

'మీ ఇష్టం నాన్నా' అని అంటూన్న గోపాలాన్ని పుణికి పుచ్చుకుని 'నా కొడుకే నా కొడుకే' అని సంబరపడింది తల్లి రామలక్ష్మమ్మ.

సంబంధాలు వెతికే బాధ్యత నా మీద వేశారు. కట్నం అయిదువేలు. అత్తగారి లాంఛనాలూ, వెండి పళ్లెం వెండిచెంబు, పట్టుబట్టలూ వగైరా వగైరా... అన్నీ చెప్పారు. నేను ఇంకా ఈ పనికి శ్రీకారం చుట్టనైనాలేదు. ఎక్కడో ఎప్పుడో తెలిసిన మొగం వచ్చి వాళ్ల వూళ్లోని సంబంధం సంగతి చెప్పాడు. వాడితోపాటు నేనూ వెళ్లి కనుక్కున్నాను. పిల్ల మేష్టరీ చేస్తున్నది. పేరు కనకదుర్గ. కట్నం అయిదువేలూ ఇవ్వడానికి ఒప్పుకున్నారు. మిగతా లాంఛనాలూ వగైరా లేవీ తమకు లేవన్నారు.

గోపాలాన్ని తల్లీదండ్రీతో సహా తీసుకువెళ్లి చూపించాను. 'పిల్ల వుద్యోగం చేస్తోందా?' అని నసిగాడు సీతారామయ్య. పెళ్లయ్యాక చేయించుకున్నా, మాన్పించుకున్నా మీ యిష్టం అన్నారు వాళ్లు.

'లాంఛనాలూ' అని దీర్ఘం తీసింది రామలక్ష్మమ్మ. 'పిల్లచేత వుద్యోగం చేయించుకున్నావంటే ఏడుతరాల లాంఛనాలు

వస్తాయి. 'వూరుకో' అని నేనే నోరునొక్కేశాను. మేమంతా ఇంత గుంజాటన పడ్డాముగాని గోపాలానికి చీమకుట్టినట్టయినా లేదు. ఒక తాపమూ లేదు, కోపమూ లేదు. 'ఇది ఏమిరా చందనపు బొమ్మలాంటి పిల్లని ఇలాంటివాడి పాల బడేస్తున్నావమూ' అని ఒక క్షణం అనిపించింది.

'ఆ పిల్లను చేసుకుంటావురా? అని అడిగితే 'మీరు చేసుకోమంటే చేసుకుంటాను' అన్నాడు. చెప్పొద్దూ నాకు ముత్తేయాలనిపించింది. రేపొద్దున్న పెళ్లయ్యాక కూడా తండ్రి నడిగి గాని కాపరం చేసేట్టులేదు. అలాంటివాడు ఈనాడు తల్లీదండ్రినీ కాదని వేరే కాపరం పెట్టేడంటే నాకాశ్చర్యం కాదా మరి! పెళ్లి పీటలమీద నిమ్మకు నీరెత్తినట్టు కూర్చున్న గోపాలం మూడ్నెల్లు తిరిగేసరికి వీరోచిత సాహస కార్యాలు చేస్తున్నాడంటే నాకు విచిత్రం కాదా మరి!

నేను యాత్రలకెళ్లి వచ్చేసరికి ఇంత రాద్ధాంతం జరిగిందంటే నాకు నమ్మశక్యం కాలేదు. సీతారామయ్యను కలుసుకొని నేను విన్నదాంట్లో నిజమెంతో తెలుసుకుంటేగాని మనస్థిమితం చిక్కేట్లు లేదు.

***

నేను వెళ్లేసరికి సీతారామయ్య పేపరు చూస్తూ, రామలక్ష్మమ్మ బియ్యం చేటలో పోసుకుని బాగు చేస్తూనూ కూర్చున్నారు. నన్ను వీధి గుమ్మంలోనే చూసి ఆప్యాయంగా పలకరించే వాళ్లిద్దరూ, రమ్మనిగాని కూచోమనిగాని అనకుండా, వాళ్ల పనుల్లో పడి మొగాలు చాటు చేసుకున్నారు. తప్పేదేముంది వెళ్లి సీతారామయ్య పక్కనే చతికిలబడి 'ఎలా మొదలు పెట్టను భగవంతుడా' అని దిక్కులు చూడసాగాను. వీడు మరింత పేపర్లో మొగం దాచుకున్నాడు. వీడితో లాభం లేదని రామలక్ష్మమ్మ పక్కకు తిరిగి 'చెల్లెమ్మా రామలక్ష్మమ్మా' అన్నాను. అంతే ఉప్పుటేరు పొంగింది. అన్నయ్యా అంటూ బావురుమంది. నాకు కడుపు తరుక్కుపోయింది. ఈ ముసలి కాలంలో తల్లినీ తండ్రినీ ఇంత బాధపెడుతున్న గోపాలాన్ని చంపినా పాపం లేదనిపించింది.

'వూరుకో అమ్మా! వయసొచ్చిన బిడ్డా, రెక్కొచ్చిన పిట్టా మనకు కారనుకో, ఏం చేస్తాం' అన్నాను.

'సిగ్గులేదూ నోరెత్తడానికి. మహాగొప్ప సంబంధం తెచ్చింది చాలక...' అన్నాడు సీతారామయ్య, అప్పటికి మొగానున్న పేపరు తొలగించి.

'లేకలేక ఒక్క మగనలుసు. కంటికి రెప్పలాగ పెంచుకున్నాను. పెళ్లిచేసి, చిలకా గోరింకల్లా కొడుకూ కోడలూ తిరుగుతూంటే కళ్లారా చూద్దామనుకున్నాను. నిన్ను నమ్మినందుకు మామంచి శాస్తి చేసేవన్నయ్యా' అంది రామలక్ష్మమ్మ.

వాళ్లనన్నీ అననిచ్చి, ఆవేశం తగ్గాక మెల్లిగా అన్నాను 'అయిపోయాయా?' అని.

'ఏమిటీ నీకు అంత వేళాకోళంగా వుందా! అయితే నీ ప్రోత్సాహమే వాడికి అండయ్యి వుండాలి' అన్నాడు సీతారామయ్య మళ్లీ రెచ్చిపోతూ.

'రామ రామ, ఎంత మాటన్నావురా. నా చిన్ననాటి స్నేహితుడివి. నీ కొడుకుని నీమీదకు వుసిగొల్పుతానా? ఇలా బండి దిగానో లేదో రకరకాల వార్తలు. ఏమిటా యిది అని బాధపడుతూ తెలుసుకుందామని వొస్తే మీరేమో దండకం మొదలుపెట్టారు' అంటూ ఎంతో నొచ్చుకొన్నాను. దాంతో సీతారామయ్య కూడా దిగిపోయి-

'ఏం చెయ్యమంటావురా, ఇంకొకడూ ఒకడూ కాదు. ఎన్నడూ తల్లి దండ్రుల మాట జవదాటని సాక్షాత్తూ గోపాలం, ఈనాడు మాతో తెంచుకు వెళ్లాడంటే...' మాట పూర్తి చెయ్యలేక కళ్లనీళ్లెట్టుకున్నాడు సీతారామయ్య.

'అదే నాకూ ఆశ్చర్యంగా వుందయ్యా. వాడికింత చేవ ఎలా వచ్చిందంటావూ?'

'ఎలా వచ్చినదేమిటన్నయ్యా! పక్కన కోడలు పిల్లవుందిగా. తనుగా అంటే అత్తా కోడలూ అంటారని వాడ్ని మా మీదికి రెచ్చగొట్టింది.'

'వాడి కాళ్లు పట్టుకుని బ్రతిమాలి అయినా తీసుకువస్తానుగాని అసలు జరిగిందేమిటో చెప్పు చెల్లెమ్మా' అని బ్రతిమిలాడాను.

'ప్రత్యేకం కొత్తగా జరిగిందేమీ లేదన్నయ్యా! లోకంలో జరుగుతున్న మామూలు తతంగమే. పెళ్లాం బెల్లం, తల్లి విషమయింది. నీకూ మిగిలాయి కాబోలు వెళ్లాలనుకుంటే వెళ్లు.'

వీళ్ల ధోరణంతా చూడగా చూడగా అసలు సంగతేమీ లేనట్టుగా అనిపించింది. ఫలానా అని చెప్పుకుంటే నలుగురూ అవునంటూ అంగీకరించేది కూడా కాదనిపించింది. మరేమిటి?

పెళ్లయిన మర్నాడు వధూవరుల్ని ఇక్కడికే తీసుకువచ్చేశాం. మిగిలిన ఆ శుభకార్యం ఇక్కడే పూర్తిచేశాం. అదిగో అప్పట్నుంచే గోపాలం మారిపోయాడంటుంది రామలక్ష్మమ్మ. ఆవేళ పొద్దున్న లేస్తూనే 'అమ్మా ఇడ్లీలోకి కొబ్బరి పచ్చడి వద్దు. సాంబార్లు చేయించవే' అన్నాడట. అయ్యో బిడ్డ! ఎన్నడూ ఫలానిది కావాలని అడగనివాడు అడిగేడే అని మురిసిపోయిందట! అప్పట్నుంచే అన్నింట్లోనూ రుచులు పెరిగిపోయాయట.

పాపం రామలక్ష్మమ్మకయినా ఒక్కతే కోడలా. ఆలించినా పాలించినా ఈ కోడలే. ఏదో



**ప్రతిభకే గుర్తింపు!**

అందాల బాలీవుడ్ నటి లారాదత్త. లార, ప్రియంకచోప్రా కలిసి 'అందాజ్'లో అక్షయ్‌కుమార్ సరసన చేశారు. తొలి నుంచి ప్రియంక, దర్శకుడు రాజ్‌కంవర్ నుంచి హీరో అక్కీ వరకూ కాస్త ఎక్కువ చనువే ప్రదర్శించిందట. పాపం, రిజర్వ్‌డ్‌గా వుండే లార, అసలు ప్రమోస్‌లోనైనా తనను చూపుతారో లేదో అని అనుమానించిందిట. కానీ చిత్రం విడుదలయ్యాక, ప్రియంక కన్నా లారకే ఎక్కువగా ప్రశంసలు వస్తే, అప్పుడు హాయిగా ఊపిరి పీల్చుకుందట. "నాకు తెలుసు, ప్రతిభ వున్న చోట ప్రశంసలు తప్పకుండా వస్తాయి" అంటూ, బాగుంది వరస!

అత్తగారు కదా అన్న చనువు కొద్దీ రెండు అననూ అంటుంది పడనూ పడుతుంది. దానికే వాడింత రాద్ధాంతం చేయాలా? పెద్దవయసూ, వాతం నొప్పుల మనిషా! అర్ధరాత్రి వరకూ షికార్లు తిరిగి వస్తే కంచాలూ చెంబులూ పెట్టుకుని ఎదురుచూస్తూ ఎంతకని కూర్చుంటుంది. అప్పటికీ నోరెత్తకుండా ' రారా బాబూ అన్నం వడ్డిస్తాను' అనేదట తిరిగి తిరిగి వచ్చినవాళ్లతో.

'ఇప్పటివరకూ నిన్నెవడు వుండమన్నాడూ. తినేసి పడుకోవే అంటే వినవేం? నువ్వేమీ వడ్డించక్కర్లేదు పో' అని కసిరేవాడట.

'అక్కడకూ కోడలు- 'వూరుకోండి, పెద్దవార్ని పట్టుకొని అలా కసురుతారేమిటి. వెళ్లి కాళ్లు కడుక్కోని రండీ' అనేదట.

'వూ... ఆవిడేమో పెద్దది. నువ్వేమో చిన్నదానివి. మధ్య నేనే నడిమి.. అందరూ నాకు చెప్పేవాళ్లే' అంటూ దాని నెత్తిమీదా ఓ మొట్టికాయ వేసేవాడట.

ఈ తతంగం చూసి ఓరోజు వుండబట్టలేక అనేసిందిట. 'కోడలు వచ్చిన వేళ గొడ్డువచ్చిన వేళ అన్నారు. ఈనాడు తల్లి నీకు విషమయిపోయిందా నాయనా' అని. అంతే అంతెత్తున ఎగిరిపోయి-

'ఇదుగో అమ్మా! ఏమన్నా అనాలనుకుంటే నన్నను. దాన్నేమన్నా అన్నావంటే మంచి మాటకాదు. జాగ్రత్త!' అని తర్జనితో బెదిరించాడట.

దాంతో ఈవిడకు మండింది. పెళ్లిలో అచ్చటా ముచ్చటా వాళ్లు తీర్చలేదు. ఇంటికొచ్చాక కొడుకు తీర్చుకోనివ్వడం లేదు. నా ఖర్మ ఇలా కాలింది అనుకొంటూ ఓ రోజు కొడుకు లేకుండా చూచుకొనే కోడల్ని ఎత్తిపొడిచిందట. ఆవిడ ఖర్మకాలి అప్పటికే వచ్చి వున్నాడో ఏమో వెంటనే ఇవతలికి వచ్చి-

'రాణీ! అవలావుంచి, నువ్విలావచ్చి కూర్చో. గిన్నెలూ చెంబులూ నేను తొలుస్తాను. నువ్వేమీ ఈ ఇంటికి బాకీలేవు. నేనే నీకు అయిదువేలు బాకీ వున్నాను.' అంటూ చేస్తూన్న పనిలోంచి ఈడ్చుకెళ్లాడట. అన్నట్టు చెప్పడం మరిచాను, వాడు పెళ్లయిన మూడోనాటి నుండీ పెళ్లాన్ని రాణీ అని పిలుస్తున్నాడు. ఆ పిల్ల పేరు కనకదుర్గ.

ఇలాంటివే అన్నీను. వడ్ల గింజలో బియ్యపు గింజ. నలుగురు మనుషులున్నాక ఒకమాట అనుకోనూ అనుకుంటారు. పడనూ పడతారు. కాని వాడికింత చేవ ఎందుకొచ్చిందీ అని?



అసలు విడిపోయేవరకూ ఎలా వచ్చిందీ అని...

కనకానికి ఈ వూరి మునిసిపాలిటీలో వుద్యోగం వేయించాడట గోపాలం. సీతారామయ్య చిలక్కి చెప్పినట్టు ఎంతో బోధించేడట.

'ఆడపిల్ల వుద్యోగానికి వెళ్లడం మన ఇంటా వంటా లేదురా' అని.

'ఆహాఁ అత్తా కోడళ్లు ఇంట్లో కూచుని జట్టీలాడుకోవడం వుందా' అని అడిగాడట. చిన్నంతరం పెద్దంతరం లేదు, నోటికెంత మాటొస్తే అంతా అనెయ్యడం నేర్చుకున్నాడు' అని వాపోయాడు సీతారామయ్య.

'పోనీ అమ్మాయిని అడుగు ఉద్యోగం చెయ్యాలని వుందో లేదో' అన్నాడట, కనకం తన మాట తీసేయదన్న ధీమాతో.

'అమ్మాయినీ లేదు, బొమ్మాయినీ లేదు' అంటూ పెళ్లాం పక్కచూసి కన్ను గీటాడట. వీడి ధోరణి చూసి ఆ అమ్మాయి అక్కడనుండి పారిపోయిందట. దాంతో సీతారామయ్యకు చిర్రెత్తుకు వచ్చింది.

'ఏమిట్రా, మరీ ముద్దు ముద్దుగా చెబుతూంటే ముక్కట్టుకు ఆడిస్తున్నావూ. నా గొంతులో వూపిరుండగా అమ్మాయిని ఉద్యోగానికి పంపను. 'ఫలానా సీతారామయ్య కోడలు' అని అందరూ వేలెత్తి చూపితే వున్న వూళ్లో నాకు తలవంపులు.'

'పోనీలే నా గొంతులో వూపిరుండగా వెళ్తుంది. 'ఫలానా గోపాలం పెళ్లాం' అని అందరూ చెప్పుకుంటూంటే వినడం నాకిష్టం' అన్నాడట సగం పట్టుదలా, సగం వెక్కిరింపూ కలిపి.

దాంతో పూర్తిగా వెర్రెత్తింది సీతారామయ్యకు-

'నా ఇంట్లో అది జరగనివ్వను' అని అరిచాడు.

'నా ఇంట్లో జరుగుతుందిలే!'

***

అంతే! మొండివాడు రాజుకన్నా బలవంతుడు అని సామెత. అంతావిన్న నాకు చాలా భయం వేసింది. గోపాలానికి నచ్చచెబుతానని వీళ్లకి మాటయితే ఇచ్చాను గానీ, తండ్రిని లక్ష్యపెట్టనివాడు నన్నెంతెంత మాటలు అనిపోతాడో ఏమో!

నెమ్మదిగా మెట్లెక్కి గుమ్మంలోకి తొంగి చూశాను.

'రా మామయ్యా రా! ఇవాళ నీ దృష్టి ఈ అల్లుడిమీద పడిందంటే ఏదో విశేషం వున్నదన్నమాటే! రాణీ! మామయ్య వచ్చాడు. వేడి వేడి కమ్మటి కాఫీ తీసుకురా, కొంచెం చల్లబడతాడు.' అంటూ నన్ను ఆహ్వానిస్తూనే లోపలకు కేక వేశాడు. గోపాలాన్ని పరీక్షగా చూశాను. మొఖంలో వింత అందం వెలుగుతోంది. కళ్లు తళుకు లీనుతున్నాయి. మనిషిలో రాచఠీవి వలుకుతోంది. పెళ్లి అన్నది మనిషిలో ఇంతమార్పు తెస్తుందంటే బలవంతానయినా ప్రతివాడికీ పెళ్లి చేసేయవలసిందే!

సుఖంగా వాలు కుర్చీలో కూర్చుంటూ 'ఏమిటి గోపాలం. ఏమిటి యిదంతా?' అని అడిగాను.

'జ్ఞానోదయం మామయ్యా జ్ఞానోదయం' అన్నాడు. నేను వచ్చిన నవ్వును మింగేశాను. ఇంతలో కనకం కాదు కాదు రాణి కాఫీ గ్లాసుతో వచ్చింది.

'వచ్చారా బాబాయ్! మీరన్నా చెప్పండీయనకు. అక్కడ అత్తగారూ మామగారూ పాపం ఎంత బాధపడుతున్నారో, రాను రాను ఈయనకు మతి పోతోంది' అంది,

"చాల్లేవోయ్ చెప్పొచ్చావు, కాసేపు బుద్ధిగా ఇక్కడ కూర్చో" అంటూ చెయ్యిపట్టుకు లాగాడు. గోపాలం పక్కనే కూలబడింది రాణి సిగ్గుపడుతూ. చెయ్యి వదిలించుకోవాలని చూసింది గానీ వాడు వదల్లేదు. నిదానించి ఆ అమ్మాయిని చూశాను. పెద్ద విశేషాలేవీ ఆ అమ్మాయిలో నాకు కనబడలేదు. అత్తగారి మీదికి మొగుడ్ని రెచ్చగొట్టే పగగానీ, మొగుడ్ని బానిసను చేసుకుందామన్న స్వార్థంగానీ కనిపించలేదు. వాడిమీద వల్లమాలిన అనురాగం ఒక్కటే ఆ అమ్మాయిలో కనబడుతోంది.

కాఫీ తాగేసి స్థిమితంగా వెనక్కు జార్లబడి-

'చెప్పవోయ్ అల్లుడూ చెప్పు. జ్ఞానోదయం

ఎప్పుడు కలిగింది, ఎలా కలిగింది, ఎందుకు కలిగింది?' అనడిగాను.

'మామయ్యా! ఇప్పుడొక చిన్న సైజు వుపన్యాసం ఇస్తాను. మధ్యలో అడ్డు ప్రశ్నలేవీ వెయ్యకుండా సావధానంగా విను' అంటూ గొంతు సవరించుకున్నాడు. కానీయమన్నట్టు నేను తలవూపాను.

'మగవాడి జీవితంలో తల్లి ఎక్కువా భార్య ఎక్కువా అన్న సమస్య బహుశా మన భారతదేశంలోనే వుండి వుంటుంది. ఆడదాని జీవితంలోకి మొగుడు కావాలా, కొడుకు కావాలా అన్న ప్రశ్న పంపించి అనేక సినిమాల్లోనూ, పుస్తకాల్లోనూ ఆడది మొగుడ్నే ఎంచుకోవడం చూపించి అదే ఆదర్శ మహిళాత్వమని చాటారు. అది చూసి మనందరమూ చప్పట్లు కొట్టాము. అదే రకంగా పురుషుడు భార్య ఎక్కువని ఎంచుకుంటే చప్పట్లు కొట్టరెందుచేత?

నిజమే నవమాసాలూ మోసి తల్లి కంటుంది. తల్లి కనడానికి బిడ్డ బాధ్యుడా మామయ్యా! నన్ను కనకమ్మా అని బ్రతిమాలుకున్నాడా? అలాగే ఎన్నో కష్టనష్టాలు కోర్చి, ఎన్నో ప్రయాసలు పడి పెంచి పెద్దవాళ్లను చేస్తారు. దానికి కూడా బిడ్డ బాధ్యుడు కాడు. ఫలానా వాళ్ల బిడ్డ అని అందరూ చెప్పుకోవాలన్న కాంక్షతో, వాళ్ల ఆశలూ కోరికలూ వీళ్లమీద తీర్చుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ప్రకృతి సహజమైన కాంక్షతో, బాధ్యతతో కనిపెంచిన తల్లిదండ్రులు దీనికంతటికీ మూల్యం చెల్లించమనడం న్యాయంగా వుందా మామయ్యా?

మనిషి జీవితంలో బాల్యకౌమార్యాలు చాలా తక్కువ కాలం మామయ్యా! మిగతా జీవితమంతా జీవిత సహచరిణి అయిన భార్యతో గడపాలి. శారీరకంగా మానసికంగా ఒకరితో ఒకరు అంకితమై తాదాత్మ్యం చెందడమన్నది చెప్పగలిగిన అనుభూతి కాదు. ఆ సమయంలో తల్లీ తండ్రీ, బంధువులూ, స్నేహితులూ, భూమీ, ఆకాశం అన్నీ మిథ్య. అదొక్కటే వాస్తవం అనిపిస్తుంది. ఈ రకమైన అనుభూతి కష్టపడి కనడం మూలాన తల్లికి బిడ్డతో వుండొచ్చుగాని, బిడ్డకు తల్లిపట్ల వుండడానికి అవకాశం లేదు.

అయినా సరే అందుకు మూల్యం చెల్లించమంటున్నారు. ఏ జీవజాలంలోనూ లేని ఆర్థిక బంధం, సేవాబంధం, త్యాగబంధం మనుషుల జీవితానందాన్ని తినేస్తుంది మామయ్యా! భర్తను తెచ్చుకోవడానికి భార్య డబ్బు చెల్లించాలి. అంటే జతగాడ్ని కొనితెచ్చుకోవాలి. అయినా ఆవిడ స్థానం కుటుంబంలో ఎటువంటిది? అంట్ల గిన్నె తోమడమూను, వంటిల్లు అలకడమూను.' అని కాసేపాగి -

'అత్తయ్య ఎప్పుడు పోయింది మామయ్యా?' అని అడిగాడు హఠాత్తుగా. నేను కంగారుపడ్డాను. అవును ఎప్పుడు పోయిందీ?

'దగ్గర దగ్గర పాతిక ఏళ్లు అవుతోందిరా' అన్నాను నెమ్మదిగా.

'అంటే నీకు ముప్పై ఏళ్ల వయసులో నన్నమాట.'

'అవును.'

'ప్చ్. చాలా పొరపాటు చేశావు మామయ్యా. మళ్లీ పెళ్లి చేసుకోవలసింది.'

నాకు గుండెల్లో సన్నని బాధ రగిలింది.

'స్నేహ సంబంధమైన దాంపత్య బంధం నువ్వు వూహించగలవా మామయ్యా! నాకు తెలుసు నువ్వు వూహించలేవు. అందులో ఒకరు ఎక్కువా ఒకరు తక్కువా లేదు. వుల్టా సీదాలు లేవు. గృహమే స్వర్గసీమ అన్నట్టు వుండాలని నా కోరిక. మా రాణిని ఏదో అనడం చిన్నబుచ్చడం, మానాన్న పాతకాలపు పెత్తందారీ, స్పర్థలు, వీటితో మనసు కలతబారుతుంటే ఇంక దాంపత్య బంధంలో మాధుర్యం ఎలా అనుభవించగలం మామయ్యా! ఈ అనంత కాలగమనంలో బాల్య కౌమారాలకు కొంతపోగా మిగిలింది ఏ మాత్రముందో! అమూల్యమయిన ఆ కాలాన్ని అనవసరమయిన చికాకుతోనూ, వ్యర్థమైన స్పర్థలతోనూ ముగించలేను. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను మామయ్యా.'

తప్పకుండా వాడివే మామయ్యా! నువ్వూ నేనూ ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా అవి వాడివే మామయ్యా.

'మరి నీ తల్లిదండ్రుల సంగతేమిటి?'

'వారికేమయింది మామయ్యా! ఆర్థికంగా లోటులేదు. లేవలేనంత ముసలితనంలో నా ధర్మం నాకు తెలుసు.'

'నీవరకూ బాగానే వుందయ్యా. మరి నీ బిడ్డలకు కూడా నువ్వు తండ్రివన్న సంగతి మరిచిపోకు' అన్నాను నెమ్మదిగా. వాడు నవ్వుతూ-

'ఇంత ఆలోచించినవాడిని ఆ సంగతి ఆలోచించనా మామయ్యా. నా ఈ చైతన్యం జీవితాంతం నిలుపుకోవాలన్నదే నా ఆకాంక్ష. జీవితంలో ఎవరిస్థానం వారి కుంటుంది మామయ్యా. అంతకు మించి కోరుకున్నప్పుడే పేచీ వస్తుంది' అన్నాడు. వాడి ముఖంలో ఓ అందం, ఇంకో ఆనందం వెల్లివిరుస్తున్నాయి. వాడికింత చైతన్యం కేవలం పెళ్లి వల్లే వచ్చిందా? ఇంతసేపూ కళ్లప్పగించి వాడిమాటలు వింటూన్న కనకం ఆనందం పట్టలేక కళ్లనీళ్లు తుడుచుకుంది.

'నాన్న గురించి ఇంత ఆలోచిస్తున్నావే- భార్యా పిల్లలూ ఎవరూ లేనివాడివి నీ సంగతేమిటి మామయ్యా' అన్నాడు నా మొగంలోకి చూస్తూ. నేను వెర్రి మొగం వేసి దాటవేస్తూ-

'అయితే ముందొచ్చిన చెవులకంటే వెనకొచ్చిన కొమ్ములు వాడివే నంటావు' అన్నాను చిన్నగా నవ్వి.

'వాడి సాహసానికి భయం, వాడి నిర్ణయానికి ఆనందం కలిగాయి. వాళ్లిద్దర్నీ చూస్తోంటే ఆది దంపతులను చూస్తోన్నట్టుంగా వుంది. ఆ క్షణాన నేను మళ్లీ పెళ్లి చేసుకుంటేనో అనిపించింది. ■

## ఒకటి పోతే మరొటొచ్చింది!

తనకు అవకాశాలొచ్చిన చిత్రాల్లో తనను తప్పించేసి, ప్రియంకాచోప్రాను తీసుకున్నారని, శిల్పాశెట్టికి చాలా కోపంగా వుందట. కానీ, కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వాహకులు, ఆ సందర్భంగా శిల్పను చూసి, ముగ్ధులయ్యారట. ఇహ నుంచీ తమ ప్రతి ఫంక్షన్లోనూ శిల్పనే పెర్ఫార్మ్ చేయమని ఆహ్వానించారట కూడా. "అంతర్జాతీయంగా పేరు రావాలే కానీ, బాలీవుడ్డో లెక్కా?" అనుకుంటూందిట ఇప్పుడు శిల్ప.

